# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 31-07-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

❖ అన్నదాత సుఖీభవ పథకాన్ని ఆగస్టు 2న ప్రకాశం జిల్లా దర్శిలో ప్రారంభిస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.

❖ రాష్ట్రానికి పెద్ద ఎత్తున పరిశ్రమలు రానున్నాయని ఐటీ శాఖా మంత్రి నారా లోకేష్ వెల్లడించారు.

❖ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని హోం మంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు.

❖ ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రకాశం బ్యారేజ్ గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు.

❖ భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య ఐదవ టెస్టు మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో భారత్ ఈరోజు భోజన విరామ సమయానికి 2 వికెట్ల నష్టానికి 72 పరుగులు చేసింది.

==================================

అన్నదాత సుఖీభవ పథకాన్ని ఆగస్టు 2 నుంచి అమలు చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. ప్రకాశం జిల్లా దర్శిలో ఈ పథకాన్ని ప్రారంభించనున్నామని ఆయన వెల్లడించారు. అన్నదాత సుఖీభవ పథకం అమలుపై ముఖ్యమంత్రి ఈ రోజు అమరావతిలోని రాష్ట్ర సచివాలయం నుంచి దృశ్య మాధ్యమం ద్వారా జిల్లా కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం “పీఎం కిసాన్ యోజన” ద్వారా ఇచ్చే 6 వేల రూపాయల ఆర్థిక సహాయంతో కలిపి రాష్ట్ర వాటాగా మరో 14 వేల రూపాయలను ఈ పథకం ద్వారా అందిస్తామని పేర్కొన్నారు. మొదటి విడతలో రాష్ట్రం వాటా 5 వేల రూపాయలు, కేంద్ర ప్రభుత్వ వాటా 2 వేల రూపాయలు వంతున ఆగస్ట్ 2న విడుదల కానున్నాయని చెప్పారు. రాష్ట్రంలోని 46 లక్షల 85 వేల 838 మంది రైతులకు ‘అన్నదాత సుఖీభవ పథకం’తో లబ్ది చేకూరనుందని అన్నారు. ఈ పథకం కోసం 2,342 కోట్ల రూపాయల నిధులను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిందని చంద్రబాబు నాయుడు వెల్లడించారు.

==================================

రాష్ట్రానికి పెద్ద ఎత్తున పరిశ్రమలు రానున్నాయని ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ తెలిపారు. అమరావతి రాష్ట్ర సచివాలయంలో ఈ రోజు ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... పెట్టుబడులను ఆకర్షించేందుకు సింగపూర్ లో నిర్వహించిన పర్యటన విజయవంతం అయిందని చెప్పారు. ఐటీ తదితర రంగాలలో పరిశ్రమలు స్థాపించేందుకు మెరుగైన అవకాశాలు ఉన్నాయని తెలిపారు. అమరావతిలో క్వాంటం వ్యాలీ గురించి సింగపూర్ పర్యటనలో పారిశ్రామికవేత్తలకు వివరించామని మంత్రి నారా లోకేష్ తెలియజేస్తూ...

(వాయిస్ 32 సెకన్లు)

==================================

రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని హోం మంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఈ రోజు మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ... ప్రతిపక్ష నాయకులు వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి పర్యటనలకు ప్రభుత్వం అనుమతిస్తోందన్నారు. ఈ పర్యటనలకు సంబంధించి సరైన సమాచారం అందిస్తే.. దానికి అనుగుణంగా ఏర్పాట్లు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని హోం మంత్రి తెలిపారు. పర్యటనల పేరుతో ఎవరైనా అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు.

==================================

ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రకాశం బ్యారేజ్ అన్ని గేట్లను ఎత్తి నీటిని సముద్రంలోకి విడుదల చేస్తున్నామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. ఇబ్రహీంపట్నం మండలంలో కలెక్టర్ ఈ రోజు పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... వరద ఉద్ధృతి కారణంగా బ్యారేజ్ లో నీటి స్థాయి మూడు లక్షల క్యూసెక్కులకు చేరుకునే అవకాశమున్నందున కృష్ణానది పరీవాహక ప్రాంతాల ప్రజలు వాగులు, వంకలు, కాలువలు వంటివి దాటే ప్రయత్నం చేయవద్దని కోరారు. క్షేత్రస్థాయిలో సమన్వయ శాఖల బృందాలను అప్రమత్తం చేసేందుకు జిల్లా కలెక్టరేట్‌లో 91549 70454 నంబరుతో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.

==================================

అమరావతిలో అంతర్జాతీయ స్థాప్రమాణాలతో హరితవనాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. రాజధానిలో సుందరీకరణ, పచ్చదనాన్ని పెంపొందించే విషయంలో చేపట్టాల్సిన కార్యాచరణ గురించి రాష్ట్ర సచివాలయంలో ఈ రోజు జరిగిన సమీక్షా సమావేశంలో అధికారులతో ముఖ్యమంత్రి చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అమరావతిలో ఔషధ మొక్కలను నాటాలని సూచించారు. గ్రీన్ బెల్ట్ ప్రాంతంలో దేశీయ వృక్షజాతులు ఉండేలా చూడాలని కోరారు. ఈ సమీక్షలో రాష్ట్ర పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్ కుమార్, ఏడీసీ సీఎండీ లక్ష్మీ పార్థసారధి తదితరులు పాల్గొన్నారు.

విరామం

==================================

సింగపూర్ లో రాష్ట్ర పురపాలక శాఖా మంత్రి పి.నారాయణ పర్యటన కొనసాగుతోంది. ఈ పర్యటనలో భాగంగా సింగపూర్ లో అమరావతి రాజధాని నిర్మాణానికి సంబంధించిన పలు అంశాలపైన సింగపూర్ ల్యాండ్ ట్రాన్స్ పోర్ట్ అథారిటీ ప్రతినిధులతో ఈ రోజు ఆయన సమావేశం అయ్యారు. అదే విధంగా అమరావతి రోడ్ ట్రాన్స్ పోర్టు గురించి సంస్థ ప్రతినిధులతో మంత్రి చర్చించారు. అనంతరం సింగపూర్ లో JTC పౌల్ట్రీ ప్రాసెసింగ్ హబ్ ను కూడా సందర్శించారు. రాష్ట్రంలో కోళ్ల వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో ప్రాసెస్ చేసే యూనిట్లను ఏర్పాటు చేసే ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని మంత్రి ఈ సందర్భంగా తెలియజేశారు.

==================================

ప్రతి గ్రామాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పేర్కొన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు నియోజకవర్గం మక్కువ మండలం డి.శిర్లాం గ్రామంలో ఈ రోజు నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. విద్య, వైద్యం, రవాణా, తాగునీరు, మౌలిక సదుపాయాల కల్పన వంటి అన్ని రంగాల్లో సమగ్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని మంత్రి వివరించారు.

================================

విశాఖపట్నంలో పరిశ్రమల ఏర్పాటుకు జిల్లా యంత్రాంగం నుంచి పూర్తి సహకారం ఉంటుందని కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ తెలిపారు. జిల్లాలోని పారిశ్రామికవేత్తలు, వివిధ విభాగాల అధికారులతో కలెక్టర్ కార్యాలయంలో ఈ రోజు జరిగిన డిస్ట్రిక్ట్ ఇండస్ట్రియల్ ఎక్స్ పోర్ట్ అండ్ ప్రమోషన్ కమిటీ (డీఐఈపీసీ) సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... పారిశ్రామికవాడల్లో మౌలిక సౌకర్యాలు కల్పించటంపై అధికారులు దృష్టి సారించాలని సూచించారు. ఏపీఐఐసీ ద్వారా కేటాయించిన భూములలో నిర్ణీత సమయంలో నిర్వాహకులు పరిశ్రమలు నెలకొల్పేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

================================

పార్వతీపురం మాన్యం జిల్లా వ్యాప్తంగా రేపు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేయనున్నామని కలెక్టర్ ఏ.శ్యామ్ ప్రసాద్ వెల్లడించారు. ఈ మేరకు ఈరోజు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలోని లక్షా 40 వేల 672 మంది లబ్దిదారులకు పింఛన్లు పంపిణీ చేస్తామని వివరించారు. ఇందులో కొత్తగా మంజూరైన 1,634 వితంతు పింఛన్లు ఉన్నాయని తెలిపారు.

================================

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈ రోజు నష్టాల్లో ముగిశాయి. ఉదయం సెన్సెక్స్ 81,481 పాయింట్ల వద్ద నష్టాల్లో ప్రారంభమై... చివరికి 296 పాయింట్ల నష్టంతో 81,185 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 86.70 పాయింట్ల నష్టంతో 24,786 వద్ద ముగిసింది.

================================

భారత్ ఇంగ్లాండ్ జట్ల మధ్య ఐదవ టెస్ట్ మ్యాచ్ లండన్‌లోని ఓవల్ స్టేడియం వేదికగా ఈ రోజు ప్రారంభమైంది. టాస్ గెలిచిన ఇంగ్లాండ్ బౌలింగ్ ఎంచుకోవడంతో తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన భారత్ భోజన విరామ సమయానికి 2 వికెట్ల నష్టానికి 72 పరుగులు చేసింది.

================================

రాష్ట్రంలో దిగువ ట్రోపో ఆవరణంలో పశ్చిమ గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. వీటి ఫలితంగా రాష్ట్రంలో రాగల మూడు రోజుల వరకు ఒక మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణం కేంద్రం అధికారిణి జి. లక్ష్మి తెలియచేస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

================================
================================